# సాక్షి
## బాపట్ల
బుధవారం । 15 । మార్చి । 2023







### గజేంద్ర మోక్షం అలంకారం
మంగళగిరి: ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా లక్ష్మీనృసింహస్వామి వారు మంగళవారం గజేంద్ర మోక్షం రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



### నిమ్మకాయల ధరలు
తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,400, గరిష్ట ధర రూ.8,400, మోడల్ ధర రూ.7,400 వరకు పలికింది.



### నేడు సరస్వతి యాగం
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం దేవస్థాన యాగశాలలో సరస్వతి యాగాన్ని నిర్వహిస్తారు.

## న్యూస్‌రీల్

### ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**నరసరావుపేట రూరల్:** విద్యార్థినులు రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు అధికంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం లింగంగుంట్ల శంకరభారతీపురం హైస్కూలులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, ఎంఈఓ జ్యోతికిరణ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితాలపై కసరత్తు
**నరసరావుపేట రూరల్:** రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలతో మండలంలోని ఐదు పంచాయతీలు, ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికల కసరత్తును అధికారులు ప్రారంభించారు. పట్టణ శివారు ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియలో కొంతమంది కోర్టుకు వెళ్లడంతో మున్సిపాలిటీతో పాటు మండలంలోని కేసానుపల్లి, రావిపాడు, యల్లమంద, లింగంగుంట్ల, ఇస్సప్పాలెం పంచాయతీలు, జిల్లా పరిషత్ పరిధిలోని ఇస్సప్పాలెం, రావిపాడు-1, రావిపాడు-2, లింగంగుంట్ల-1, లింగంగుంట్ల-2, లింగంగుంట్ల-3, యల్లమంద, కేసానుపల్లి ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు గతంలో నిలిచిపోయాయి. ఆయా గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో ఓటర్ల జాబితాలు ఈనెల 21వ తేదీలోపు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి మండల అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో మండల అధికారులు వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే పనిని ప్రారంభించారు.

### నవోదయంలో 365 దరఖాస్తుల స్వీకరణ
ఇద్దరికి ఉద్యోగ నియామకపత్రాలు



**నరసరావుపేట:** పల్నాడు కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నవోదయం కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. కలెక్టర్, సంబంధిత అధికారులకు తమ పరిస్థితిని వివరించి జీవన ప్రగతికి తగిన సహకారం అందించాలని కోరుతూ ప్రజలు 365 దరఖాస్తులను సమర్పించగా, జిల్లా అధికారులు, బ్యాంకర్లు వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్థులు, యువత, మహిళలు వారికి అవసరమైన విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించాలని కోరారు. వాటిని సచివాలయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపి నిశితంగా పరిశీలన చేసిన అనంతరం అర్హత కల్గినవారందరికీ తగిన సహకారం అందిస్తామంటూ భరోసా కల్పించారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇద్దరికి సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఉద్యోగాల నియామక పత్రాలను అందించారు. జిల్లా రెవెన్యూ శాఖ అధికారి కె.వినాయకం, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

### రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం
**రొంపిచర్ల:** మండల కేంద్రమైన రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషితోనే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రియ విద్యాలయం మంజూరుపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు స్థల సేకరణ కూడా జరిగింది. అలాగే రాష్ట్రంలో 9 కేంద్రియ విద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగా అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, రొంపిచర్లలకు రెండు మంజూరు చేయడం విశేషం.

### రేపు ఎంపీహెచ్‌ఏ కౌన్సెలింగ్
**గుంటూరు మెడికల్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ-మేల్) లకు పునర్విభజన కౌన్సెలింగ్ ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

# 'పది' పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

**బాపట్ల:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ ఆదేశించారు. పదోతరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి అధికారుల సమన్వయ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్‌లో జరిగింది. విద్యార్థుల జీవితాలు మార్చే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 331 పాఠశాలల నుంచి 17,344 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరి కోసం 103 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా కేంద్రానికి విద్యార్థులు రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాలలోకి సెల్‌ఫోన్లు అనుమతించరాదన్నారు. కేంద్రాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి కేంద్రం వద్ద ప్రాథమిక వైద్యం అందించేలా సిబ్బందిని నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూత వేయించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆదేశించారు.

**ప్రశ్న పత్రాలకు పటిష్ట భద్రత..**

పబ్లిక్ పరీక్షలు సమర్థంగా నిర్వహించడానికి స్పాట్ ఆఫీసర్లను ప్రత్యేకంగా నియమించాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన 10వ తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు బాపట్లకు చేరుతాయన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన తదుపరి ముందస్తుగా గుర్తించిన 29 పోలీస్ స్టేషన్లకు ప్రశ్నాపత్రాలను పంపాలన్నారు. ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు. ప్రశ్నపత్రాలు తరలించడానికి వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. 103 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 103 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లుగా 9 మంది, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లుగా మరో 9 మందిని నియమించామన్నారు. 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని, 870 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఏఎస్‌పీ మహేష్, డీఈఓ పి.వి.రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి విజయలక్ష్మి, డీపీఓ వై.శంకర్ నాయక్, ఆర్డీఓ చంద్రశేఖర రెడ్డి, ఆర్టీసీ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు

**భూముల రీసర్వే గడువులోపు పూర్తి చేయాలి..**

**బాపట్ల:** భూముల రీసర్వే ప్రక్రియ ఆయా గ్రామాల్లో నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ సూచించారు. రీసర్వే ప్రక్రియపై మండల సర్వేయర్లతో మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సర్వే పూర్తి చేసిన భూములలో ఈ నెల 31వ తేదీలోగా హద్దురాళ్లు వేయాలని కలెక్టర్ చెప్పారు. హద్దురాళ్లు వేసే ప్రక్రియపై సర్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జె.పంగులూరు, చందలూరులో ఏడువేల ఎకరాల భూములు సర్వే మిగిలి పోవడంపై ఆరా తీశారు. జాగర్లమూడి, యద్దనపూడిలో సర్వే ప్రక్రియ జాప్యంపై ఆరాతీశారు. చినగంజాం మండలం కడవకుదురు గ్రామంలో సర్వే పనులు ఊపందుకోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో మండల సర్వేయర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సర్వే ప్రక్రియలో గ్రామసర్వేయర్లు చురుగ్గా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అధికారులు, సర్వేయర్లు సర్వే ప్రక్రియపై నిర్లిప్తత వీడాలన్నారు. అనంతరం మండలాలు, గ్రామాల వారీగా సర్వే ప్రక్రియపై జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు సమీక్షించారు. సమావేశంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ మురళీకృష్ణ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు...
**బాపట్ల:** పిల్లల ఆరోగ్యం కోసం తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాపట్ల సూర్యలంక లోని కేంద్రియ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈ నెల14వ తేదీ నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ఆర్.ఎస్.చౌదరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ప్రిన్సిపాల్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

### సిద్ధమైన టెన్త్ హాల్‌టికెట్లు
విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పరీక్షలకు 20 రోజులు ముందుగానే హాల్ టికెట్లను సిద్ధం చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం రాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను జిల్లాలు, పాఠశాలల వారీగా సైట్‌లో ఉంచారు. విద్యార్థులు తమ వివరాలతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. అయితే విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే అటెస్టేషన్ చేయించుకున్న తరువాతే పరీక్షలకు హాజరు కావాల్సి ఉందని మార్గదర్శకాల్లో పొందుపర్చారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు గుంటూరు జిల్లాలో 456 పాఠశాలల నుంచి 27,714 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

**డౌన్‌లోడ్ ఇలా...**

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లోకి లాగిన్ అవ్వగానే రెగ్యులర్, ప్రైవేటు, ఓఎస్సెస్సీ, ఒకేషనల్ ఆప్షన్లు ప్రత్యక్షమవుతాయి. రెగ్యులర్‌గా పాఠశాలల విద్యార్థులు రెగ్యులర్ ఆప్షన్‌పై క్లిక్ చేసుకోవాలి. తరువాత స్క్రీన్‌పై కనిపించే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ విండోను ఓపెన్ చేయాలి. అక్కడ కనిపించే పాఠశాలల జాబితాలో తమ పాఠశాలను ఎంపిక చేసుకోగానే, అక్కడ చదువుతున్న విద్యార్థుల జాబితా ప్రత్యక్షమవుతుంది. అందులో నుంచి విద్యార్థి పేరు ఎంపిక చేసుకుని, పుట్టిన తేదీ, నెల, సంవత్సరాన్ని ఎంటర్ చేసిన వెంటనే ఫొటో, వివరాలతో కూడిన హాల్ టికెట్ కనిపిస్తుంది. కింద కనిపించే డౌన్‌లోడ్ హాల్ టికెట్‌పై క్లిక్ చేయడం ద్వారా హాల్ టికెట్ పొందవచ్చు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడం వలన పరీక్ష కేంద్రం ఎక్కడ కేటాయించారనే సమాచారంతో పాటు వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ పరిశీలించుకునేందుకు వీలుంది.

# అలరించిన దృశ్య కావ్యం

అట్టహాసంగా శ్రీకారం, రోటరీ కళాపరిషత్ నాటిక పోటీలు ప్రారంభం

**మార్టూరు:** మండల కేంద్రం మార్టూరులో మంగళవారం రాత్రి 13వ తెలుగు రాష్ట్రాల స్థాయినాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 3150 జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్, శ్రీకారం కళాపరిషత్ కార్యదర్శి జాష్టి అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. శ్రీకారం అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, జేవీ మోహనరావు, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొర్రపాటి ఖాజారావు, కుర్రా వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

**శాంతి పరిమళాలు వెదజల్లే 'కొత్త పరిమళం'..**


కరుడు గట్టిన ఉగ్రవాదమైనా, తీవ్రవాదమైనా, మానవతా వాదం ముందు తల వంచాల్సిందే అనే ఇతివృత్తంతో సాగిన కొత్తపరిమళం నాటిక ఆకట్టుకుంది. బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో బొరివంక శ్రీకాకుళం వారు నాటికను ప్రదర్శించారు. ఇండో-పాక్ సరిహద్దులో పురిటి నొప్పులు పడుతున్న పాకిస్తానీ మహిళకు భారత వైద్యుడు సరిహద్దులు దాటి పురుడు పోసి ఆ దేశపు మిలటరీకి పట్టుపడతాడు. అయితే వైద్యునికి అనుకూలంగా పాకిస్తాన్‌లో జరిగిన ప్రజా ఉద్యమం నేపథ్యంలో శత్రు సైన్యమే వైద్యుడిని భరతభూమి సరిహద్దులో దిగబెట్టడం ఆకట్టుకుంది. వీక్షకులందరూ కరతాళ ధ్వనులతో హర్షధ్వానాలు తెలిపారు.



నాటికలను ప్రారంభిస్తున్న కళాపరిషత్ సభ్యులు

**మానవ సంబంధాలు తెలిపే 'చేతిరాత'..**

అంతరించి పోతున్న మానవ సంబంధాల నేపథ్యంలో కొత్త కోణాన్ని స్పృశించి నటీనటులు ప్రేక్షకులను ఆలోచింపజేశారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే, అన్న కారల్ మార్క్స్ అర్థశాస్త్ర పదానికి సజీవ రూపకల్పనే వరికూటి శివప్రసాద్ రచన దర్శకత్వంలో ఒంగోలు జనచైతన్య వారు ప్రదర్శించిన చేతిరాత నాటిక. నిజాయతీ పరుడైన ఓ ఉద్యోగి, గయ్యాళి అయిన భార్య, వ్యసన లోలుడైన నిరుద్యోగి కుమారుడు, ఆయన కుమార్తె వివాహానికి బాకీ పడి.. వడ్డీలు, చక్రవడ్డీలు కట్టే వియ్యంకుడు మధ్య జరిగిన కథే ఈ నాటిక. భర్త మరణిస్తే పెన్షన్ వస్తుందని ఎదురు చూసే భార్య.. తండ్రి గతిస్తే ఉద్యోగం వస్తుందనుకునే కుమారుడు.. అర్ధాంతర చావుతో తన కుమారుడి వరకట్న బాకీ తీరుతుందనుకునే వియ్యంకుని రాక్షస ప్రవృత్తి .. ఇలా నేటి సమాజంలోని పలువురు వ్యక్తుల వికృత మనస్తత్వాలకు అద్దం పట్టిందీ నాటిక. జి.సాంబశివరావు దర్శకత్వంలో స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారు ప్రదర్శించిన కొండంత అండ నాటిక అలరించింది.



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

**నేడు ప్రదర్శించనున్న నాటికలు..**

రెండో రోజైన బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీకారం, రోటరీ కళాపరిషత్ మార్టూరు వారి 'డబ్బులోకం దాసోహం కారాదు' గణనాథ నాటిక, ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి శివరంజిని, కళావర్షిణి వీరన్నపాలెం వారిచే రాజరాజచోరులు, శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారిచే కమనీయం నాటిక ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# విద్వత్తుకు వేదిక

### ఏఎన్‌యూలో నేటి నుంచి అకడమిక్ ఎగ్జిబిషన్
- 160 స్టాల్స్‌లో 750కిపైగా ప్రదర్శనలు
- మూడు రోజులపాటు పలు నూతన అంశాలపై పరిశోధనలు
- ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభం కానుంది. 'గ్లోబల్ సైన్స్ ఫర్ ది వెల్‌బీయింగ్ ఆఫ్ హ్యూమానిటీ' అనే అంశంపై మూడు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలోని ట్రిపుల్ ఈ భవనంలో 160కిపైగా స్టాల్స్‌లో 750 ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో యూనివర్సిటీలోని పలు విభాగాల నుంచి 450 ప్రదర్శనలు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల నుంచి 300 వరకు ప్రదర్శనలు చేయనున్నారు. ప్రదర్శనల కోసం ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రదర్శనకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సమాచారం తెలియజేసేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అకడమిక్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎగ్జిబిషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆచార్య కె.మధుబాబు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

**సమష్టిగా విజయవంతానికి కృషి..**

అకడమిక్ ఎగ్జిబిషన్ ఏర్పాట్ల కమిటీలు, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అందరూ సమష్టిగా కృషి చేసి అకడమిక్ ఎగ్జిబిషన్ విజయవంతానికి కృషి చేయాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. ప్రదర్శనలు జరిగే ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణతో కలిసి వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌యూతోపాటు డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రభుత్వ సంస్థలు పెద్దఎత్తున హాజరవుతున్నందున వారికి అన్ని విధాల సహకారం అందించాలని సూచించారు. ప్రారంభోత్సవ సభ బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగనుండగా, సినీ దర్శకుడు పి.రామ్‌గోపాల్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# ఆలస్యమైతే నో ఎంట్రీ...

### నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు
- 16 నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం
- పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్షల నిర్వహణ
- కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- సిబ్బంది వద్ద మొబైల్ ఫోన్లకు అనుమతి నిరాకరణ
- ఉదయం 8.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతి

**బాపట్ల అర్బన్:** బుధవారం ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులను 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9 గంటల తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడకుండా విద్యార్థులు కనీసం గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో విధుల్లో ఉండే చీఫ్ సూపరింటెండెంట్ సహా డీఓలు, ఇన్విజిలేటర్లు ఎవ్వరూ సెల్‌ఫోన్లు కలిగి ఉండరాదని ఇంటర్మీడియెట్ బోర్డు స్పష్టం చేసింది. పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసే అధికారులు సైతం సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకుని వెళ్లేందుకు అనుమతి లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 134 పరీక్షా కేంద్రాల పరిధిలో 98,682 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. బుధవారం జూనియర్ ఇంటర్, 16న సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐఓ సునీత, బాలమోహనరావు

**ఫర్నిచర్ కొరత లేదు, ఆందోళన వద్దు : ఆర్ఐఓ**

ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్ కొరత లేదని, విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఆర్ఐఓ జి.సునీత చెప్పారు. ఆమె మంగళవారం గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒకేషనల్ విద్యార్థుల సంఖ్య గతంలో కంటే పెరిగిందని, పరీక్ష కేంద్రాలుగా ఒకేషనల్ కళాశాలలనే ఏర్పాటు చేయాల్సి ఉండటంతో ప్రైవేటు కళాశాలల నుంచి ఫర్నిచర్ తెప్పించామని చెప్పారు. ఫర్నిచర్ కొరత ఉందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశామని, అన్ని కేంద్రాల్లో పరీక్షల సరళిని సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# టెండర్ల దశలో అన్నదానం, ప్రసాదాల పోటు

దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన అభివృద్ధి పనుల్లో భాగంగా అన్నదాన భవనం, లడ్డూ ప్రసాదం పోటు పనులు టెండర్ల దశలో ఉన్నాయని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గగుడి అభివృద్ధి పనులపై ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులతో కలసి ఆయన మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి అభివృద్ధికి రూ.72 కోట్లను కేటాయించారని, వాటిలో రూ.30 కోట్లతో అన్నదాన భవనం, రూ.27 కోట్లతో ప్రసాదాల పోటు నిర్మాణానికి అంచనాలను రూపొందించామన్నారు. గత ప్రభుత్వాలు ఏవీ దుర్గగుడి అభివృద్ధికి రూపాయి ఇవ్వలేదన్నారు. నూతన పాలక మండలి ఏర్పడి నెల రోజులు గడిచిన నేపథ్యంలో తొలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు త్వరలోనే ఆచరణలోకి రానున్నాయన్నారు. కొన్ని పనులకు దేవస్థాన ఈఓ భ్రమరాంబ అంగీకారం తెలియజేయడంతో పాటు కమిషనర్ అనుమతి కోసం పంపామన్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.5.50 కోట్లు కేటాయించామని, జూలై నాటికి పనులు పూర్తవుతాయన్నారు. రూ.13 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుంటుందన్నారు. భక్తులకు అవసరమైన సదుపాయాలను అందించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని, భవిష్యత్తులో ఎవరూ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయకుండా ఉండేలా జీవో తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దుర్గగుడిలో భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు భక్తులెవరైనా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చునన్నారు. కేశఖండనశాలలో భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధ్యయనం చేసేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దేవస్థాన ప్రతిష్టకు భంగం కలిగించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, చిత్రంలో ఈఓ భ్రమరాంబ, బోర్డు మెంబర్లు

# ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతిలేదు
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై జిల్లాలోని పోలీస్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, ఇన్విజిలేటర్లకు ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే విద్యార్థులను, పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బందిని తనిఖీ చేయాలన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లను, స్టేషనరీ దుకాణాలను పరీక్షలు జరిగే సమయంలో మూయించాలన్నారు. ఉదయం 8:30 గంటల తర్వాత మాత్రమే తగిన బందోబస్తుతో పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు. సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు తగిన పోలీసు ఎస్కార్ట్ ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వారి పరిధిలో ఉన్న పరీక్ష కేంద్రాలను తరచూ సందర్శిస్తూ ఉండాలన్నారు. చిన్న పొరపాటు కూడా లేకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.బాలమురళీకృష్ణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, జిల్లాలోని సీఐలు పాల్గొన్నారు.

## యార్డులో 1,23,262 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు మంగళవారం 1,25,799 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,23,262 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 91,091 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# సూర్యలంకను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్



ఆలీవ్ రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్న జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్, ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: సూర్యలంక సముద్ర తీరాన్ని పర్యటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం సూర్యలంక తీర ప్రాంతంలో ఆలీవ్‌రిడ్లే సముద్ర తాబేళ్లను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సముద్రంలోకి వదిలారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో ఆలీవ్ రిడ్లే సముద్ర తాబేళ్ల గుడ్లు కనిపిస్తే పారవేయకుండా అటవీశాఖ అధికారులకు అప్పగించాలని పర్యాటకులకు సూచించారు. సముద్రంలో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లకుండా ఆలీవ్ రిడ్లే సముద్ర తాబేళ్లను సముద్రంలోకి వదలడం జరుగుతుందన్నారు. సూర్యలంక సముద్రతీరంలో ఆలీవ్‌రిడ్లే సముద్ర తాబేళ్లను వదిలి పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో సముద్రతీరంలో ఆలీవ్ రిడ్లే సముద్ర తాబేళ్ల గుడ్లు పొదగడానికి 7 ప్రాంతాలను ఎంపిక చేశామని చెప్పారు. తాబేళ్ల వలన సముద్రంలో చేపల ఉత్పత్తి పెరగడంతోపాటు, చేపల ఉత్పత్తికి ఆటంకం కలిగించే జీవులను ఆలీవ్ రిడ్లే తాబేళ్ళు తింటాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.మహేష్, సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ఆర్‌ఎస్‌చౌదరి, అటవీశాఖాధికారులు, తహసీల్దార్ కవిత పాల్గొన్నారు.

# డైట్ టెండర్లకు ఆరు దరఖాస్తులు

- టెండర్లు వేయడానికి తిప్పలే...
- డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేయని అధికారులు
- మీడియా దృష్టికి వచ్చాక హడావిడిగా బాక్స్ ఏర్పాటు

గుంటూరు మెడికల్ : గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రిలో డైట్ టెండర్ల ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం సాయంత్రం లోపు టెండర్లు దాఖలు చేయాల్సి ఉండగా, రెండుగంటలు దాటేవరకూ అసలు డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేయలేదు. టెండర్లు దాఖలు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు మధ్యాహ్నం వరకూ పడిగాపులు పడ్డారు. 'సాక్షి'లో పలు మార్లు డైట్ టెండర్లు నిర్వహణ చేపట్టకుండా ఆసుపత్రి అధికారులు ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నట్లు కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి 'సాక్షి' కథనాలపై స్పందించి తక్షణమే డైట్ టెండర్లు, సైకిల్ స్టాండ్ టెండర్లు, ఇతర టెండర్ల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆసుపత్రి అధికారులకు ఆదేశించారు. దీంతో ఈనెల 1 నుంచి 13 వరకు ఆసుపత్రి అధికారులు డైట్ నిర్వహణకు టెండరు ఫారాలు విక్రయించే గడువు విధించారు. దరఖాస్తు ఫారం కొనుగోలు చేసేందుకు రూ.7 వేలు ఫీజు నిర్ణయించారు. డైట్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానించగా ఏడుగురు దరఖాస్తులు కొనుగోలు చేశారు. మంగళవారం నాటికి దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ముగిసింది. గడువు ముగిసే సమయానికి ఆరుగురు అభ్యర్థులు టెండరు ఫారాలు సమర్పించారు. ఒక్కో అభ్యర్థి దరఖాస్తుతోపాటు రూ. 3 లక్షల డీడీని సమర్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు సమర్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాల్సిన బాక్సును మధ్యాహ్నం 2 గంటల వరకు ఆసుపత్రి అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో టెండరు దాఖలు చేసేందుకు వచ్చిన పలువురు డైట్ కాంట్రాక్టర్లు ఎక్కడ దరఖాస్తు సమర్పించాలో తెలియక అవస్థలు పడ్డారు. విషయం మీడియా దృష్టికి వెళ్లడంతో హడావిడిగా డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేశారు. కొత్తగా ఎవరికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా పాత కాంట్రాక్టర్‌ను కొనసాగించేందుకే కొందరు అధికారులు ఈ విధంగా చేస్తున్నారని టెండర్లు వేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు ఆరోపించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, చీఫ్ డైటీషియన్ గిరిధర్‌లు టెండరు బాక్సుకు సీల్‌వేసి సంతకాలు చేశారు. ఈనెల 17న మధ్యాహ్నం 3 గంటలకు జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో టెండరు ఫారాలు ఓపెన్ చేయనున్నారు.

## సకాలంలో వైద్యం ద్వారా టీబీ నివారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి

నరసరావుపేటరూరల్: సరైన సమయంలో మెరుగైన వైద్యం పొందడం ద్వారా క్షయ వ్యాధి(టీబీ)ని నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ శోభారాణి అన్నారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హెల్త్ మేళాలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రధానమైన ఆరోగ్య సమస్యల్లో క్షయవ్యాధి ఒకట్నారు. ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు జనాభా క్షయవ్యాధి బారిన పడ్డట్లు అంచనా ఉందన్నారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధి సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు టీబీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య, సంరక్షణ కేంద్రంలో టీబీ డ్రగ్స్, టీబీ పరీక్షలు ఉచితంగా అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి కె.పద్మావతి, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పశ్చిమ కాలువకు 1416 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1416 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 160 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 20 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 130 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 820 క్యూసెక్కులు విడుదల చేశారు.

## పాము కాటుతో మహిళా కూలీ మృతి

సంతమాగులూరు(అద్దంకి): పాముకాటుతో మహిళా కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. అంజమ్మ ఏల్చూరు గ్రామ పొలాల్లో మిరపకాయల కోతకు వెళ్లింది. కాయలు కోస్తుండగా పాముకాటు వేయడంతో మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు బైక్‌లు ఢీ- ఒకరు మృతి

మేదరమెట్ల: రెండు బైక్‌లు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన దైవాలరావూరు వంతెన సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రావినూతల గ్రామానికి చెందిన ఓరుగంటి దత్తు శేషారావు (35) బైక్‌పై మేదరమెట్ల వస్తున్నాడు. దైవాలరావూరు వంతెన సమీపంలోకి రాగానే.. ఎదురుగా మరో బైక్‌పై దైవాలరావూరు వైపు వెళుతున్న ఇద్దరు వ్యక్తులున్న బైక్.. శేషారావు బైక్‌ను ఢీకొంది. దత్తు శేషారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని ఒంగోలు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొరిశపాడు ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాళం వేసిన గృహంలో చోరీ

రూ.1.5 లక్షలు దోచుకెళ్లిన దొంగలు

సంతమాగులూరు(అద్దంకి): తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి నగదు దోచుకెళ్లిన సంఘటన మండలంలోని వెల్లలచెరువులో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లాకు చెందిన జి.నాగిరెడ్డి కుటుంబం గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేయడం కోసం వెల్లలచెరువులో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. భార్యాభర్తలు ఇరువురూ ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు ఫ్యాక్టరీకి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుంటారు. ఈ క్రమంలో రోజులాగే మంగళవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా, తలుపుకు వేసిన తాళం పగులగొట్టి ఉండటం, బీరువాలో ఉండాల్సిన రూ.1.5 లక్షలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించారు. పరిసర గృహాల్లోని వారు పొలాలు వెళ్లిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో చోరీ జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

## వేధింపుల కేసులో భర్తకు జైలు

తెనాలిరూరల్: భార్యను మానసిక, శారీరక వేధింపులకు గురి చేసిన భర్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వైకుంఠపురం కాలనీకి చెందిన అమిరె పవన్‌కళ్యాణ్ తన భార్య రాణిని మానసిక, శారీరక వేధింపులకు గురిచేయడంతో 2019లో ఆమె పోలీసులను ఆశ్ర యించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా మంగళవా రం విచారణకు వచ్చింది. కేసును విచారించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పైవిధంగా తీర్పునిచ్చారు.

## 23న వాహనాల వేలం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): పన్ను చెల్లించకుండా రవాణా శాఖ దాడుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు డీటీసీ షేక్ కరీం మంగళవారం తెలిపారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి ఆర్టీసీ డిపోల్లో సీజర్ యార్డుల్లో ఉన్న 36 వాహనాలకు ఈవేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, కాంట్రాక్టు క్యారేజీ, మ్యాక్సీ క్యాబ్‌లు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత వాహన యజమానులు, ఫైనాన్షియర్లు, వారు చెల్లించాల్సిన పన్నులు, అపరాధ రుసుం ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు చెల్లించి విడుదల చేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో 23వ తేదీ ఆర్టీఏ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

డీఎస్పీలకు సూచించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ కేసులపై జిల్లాలోని డీఎస్పీలతో వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నమోదైన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు ఫైల్స్‌ను స్వయంగా పరిశీలించి సదరు కేసులలో దర్యాప్తు, నిందితుల అరెస్ట్, ఛార్జిషీటు దాఖలు తదితర విషయాల్లో తగిన సూచనలు, సలహాలు సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టాలన్నారు. కేసుల విచారణ సమయంలో బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తిచేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, దర్యాప్తులో అలసత్వం వహించరాదన్నారు. సమావేశంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, డీసీఆర్‌బి సీఐ బాల మురళీకృష్ణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా పరిషత్ సీఈఓ జయమోహన్



జెడ్పీ సీఈఓ జయమోహన్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భట్టిప్రోలు: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలో సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను నిర్మించే విధంగా అధికారులు సమన్వయంగా పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జయమోహన్ అన్నారు. మంగళవారం ఆయన అవనిగడ్డ నుంచి వస్తూ భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేశారు. ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరగాలని సూచించారు. పలు కారణాల వల్ల ఇప్పటికే ఆస్యంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇంకా ఇళ్లను నిర్మించని వారిని గుర్తించి సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని కోరారు. వేసవి దృష్ట్యా లే-అవుట్లలో తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులతో సమీక్షించి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరావును ఆదేశించారు. సీఈఓ జయమోహన్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ జయచంద్రకుమార్, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు శేతు రామచంద్రరరావు, రావూరి సౌమ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యను హతమార్చిన భర్త



రామకూరులో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

జె.పంగులూరు: భార్యను భర్త చంపిన ఘటన మండల పరిధిలోని రామకూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు మేరకు.. రామకూరు గ్రామానికి చెందిన పావులూరి సునీత (32) మంగళవారం తన ఇంటిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మంచంపై చలనం లేకుండా పడి ఉంది. చుట్టుపక్కల వారు గమనించి స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లగా చనిపోయినట్లు తెలిపాడు. సునీత, భర్త లక్ష్మీనారాయణ ఇద్దరూ నిత్యం గొడవలు పడుతుంటారు. గతంలో సునీత తన భర్తపై గృహ హింస కేసు పెట్టింది. అనంతరం భార్యాభర్తలు ఇద్దరూ రాజీపడి లోకాయుక్తాలో కేసు పరిష్కారం చేసుకున్నారు. కానీ భార్యపై అనుమానంతో రాత్రి సమయంలో గొంతు నులిపి చంపి పరారై ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఈ ఘటనపై ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.